క్లుప్తంగా

నేడు పీఏసీఎస్ భవనం ప్రారంభం

కొందుర్గు: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం, షాపింగ్ కాంప్లెక్స్, గిడ్డంగులను బుధవారం ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, మహబూబ్‌నగర్ ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి పీఏసీఎస్ కార్యవర్గం, అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, రైతులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు



అప్పోజీగూడలో బోనాల ఊరేగింపు

మొయినాబాద్: మండలంలోని అప్పోజీగూడలో మంగళవారం ఎల్లమ్మ బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపు ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఉత్సవాల్లో గ్రామ సర్పంచ్ గొర్కంటి రాజు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కురుస్తున్న వర్షం.. రోడ్లు జలమయం



వర్షం నీటిని తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మొయినాబాద్ రూరల్: మండలంలో కురుస్తున్న వర్షాలకు జాతీయ రహదారి అజీజ్‌నగర్ చౌరస్తా మొదలుకోని తోల్‌కట్ట వరకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఈ సందర్భంగా మంగళవారం కురిసిన వర్షానికి అజీజ్‌నగర్ సమీపంలోని మజీదు వద్ద భారీగా వర్షం నీరు నిలవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. ట్రాఫిక్ పోలీసులు ఎస్సై ఎక్బాల్ తమ సిబ్బందితో రోడ్డుపై నిలిచిన నీటిని తొలగించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చేశారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ 1, తెలుగు 2, కామర్స్ 1, కంప్యూటర్ సైన్స్ 1, సెరీకల్చర్ 1 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పీజీలో 55శాతం మార్కులు పొంది ఉండాలని, ఎస్సీ, ఎస్టీల అయితే 56 శాతం మార్కులు ఉన్న అర్హులని పేర్కొన్నారు. ఎన్ఈటీ, ఎస్ఈటీ, పీహెచ్‌డీతో పాటుగా బోధన అనుభవం ఉన్న వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు విద్యార్హత పత్రాలతో ఈనెల 23వ తేదీలోపు దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని ఆమె తెలిపారు.

గురుకులాలకు భవనాలు నిర్మించాలని వినతి



కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నేతలు

చేవెళ్ల: ప్రభుత్వం గురుకుల పాఠశాలలకు సొంతభవనాలు నిర్మించేలా కృషి చేయాలని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్(టీఎస్ఎస్ఓ) రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ అన్నారు. మంగళవారం నగరానికి వచ్చిన కేంద్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి రాందాస్ అథావాలేకు టీఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని అన్ని గురుకులాలకు సొంత భవనాలు మంజూరు చేయాలని కోరామన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు.

సమష్టి కృషితోనే విజయం

బీజేపీ నాయకుడు విజయకుమార్

షాద్‌నగర్‌రూరల్: సమష్టి కృషితో రాబోయే ఎన్నికల్లో విజయం సాధించడం ఖాయమని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ విజయకుమార్ అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని ఎలికట్ట భవానీమాత దేవాలయం ఆవరణలో టిఫిన్ పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ.. ప్రజల్లో ఐక్యతాభావాన్ని పెంపొందిస్తూ పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. అందరిని ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు ఈ టిఫిన్ పే చర్చ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందెబాబయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి దేపల్లిఅశోక్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు భూపాలాచారి, జిల్లా అధికార ప్రతినిధి వెంకటేష్‌గుప్త, రాష్ట్ర యువనాయకుడు మిథున్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మోహన్‌సింగ్ నాయక్ పాల్గొన్నారు.

హరితహారానికి సర్వం సిద్ధం

- టార్గెట్ 5 లక్షల మొక్కలు
- రెడీగా నర్సరీలు
- 47 గ్రామాల్లో నాటేందుకు ప్రణాళిక
- ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

షాద్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తుంది. అందులో భాగంగా జిల్లాల వారీగా మొక్కలు నాటేందుకు లక్ష్యాలను కేటాయిస్తూ వస్తున్నారు. ప్రతి జూలై మాసం నుంచి హరితహారానికి శ్రీకారం చుట్టి పల్లెపల్లెన మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతలను గ్రామ పంచాయతీ పాలకమండళ్లతో పాటు సంబంధిత శాఖల అధికారులకు అప్పగిస్తున్నారు. గత రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో అన్ని గ్రామాల్లో మొక్కలు నాటేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

హరితహారానికి ప్రణాళికలు

ఫరూఖ్‌నగర్ మండలంలో హరితహారం కింద మొక్కలు నాటేందుకు ప్రభుత్వం ఇప్పటికే అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించింది. మండలంలో 47 గ్రామ పంచాయతీలోని నర్సరీల్లో సుమారు ఐదు లక్షల మొక్కలను సిద్ధం చేశారు. అయితే, గ్రామాల్లో మొక్కలు నాటేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్థలాలను గుర్తించారు. కొన్ని చోట్ల గుంతలను తీయడం ప్రారంభించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం, అటవీశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



కమ్మదనం నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

పండ్లు, టేకు మొక్కలు సిద్ధం

నర్సరీల్లో నీడనిచ్చే మొక్కలతో పాటు వివిధ రకాల పండ్ల చెట్లను పెంచుతున్నారు. లిల్లీ, మందారం, పారిజాతం, గులాబీ వంటి పూలమొక్కలతో పాటుగా దానిమ్మ, రేగు, నిమ్మ, జామ, పనస, నేరేడు, గుల్‌మొహర్, రేన్‌ట్రీ, గోరింటాకు, టేకు, శిశు, మహాగణి, టికోమోర్, ఉసిరి, జామ, కర్జూరా, దానిమ్మ, నిమ్మ, బొప్పాయి, వెదురు, మునగ, సంపంగి పెంచుతున్నారు. ఆయా గ్రామాలకు నర్సరీల నుంచి పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఇంటింటికీ పంపిణీ



నర్సరీలో రకరకాల మొక్కలను పెంచాం. ఇళ్లలో పెంచుకునే పూల మొక్కలతో పాటుగా పండ్ల మొక్కలను కూడా ఈ సారి నర్సరీలో పెంచాం. హరితహారంలో భాగంగా ఇంటింటికి మొక్కలను పంపిణీ చేస్తాం.
– భీష్మ మాధవి సర్పంచ్, లింగారెడ్డిగూడ, షాద్‌నగర్

అందరూ భాగస్వాములు కావాలి



మొక్కలు నాటే కార్యక్రమంలో అందరు భాగస్వామ్యం కావాలి. గ్రామా ల్లో మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. అవ సరమైన మొక్కలు నర్సరీల్లో సిద్ధంగా ఉన్నాయి.
– అరుణ, ఏపీఓ ఫరూఖ్‌నగర్

రైతు వ్యతిరేక పార్టీ కాంగ్రెస్

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: రైతు వ్యతిరేక పార్టీ కాంగ్రెస్ అని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని కొండన్నగూడలోని రైతు వేదికలో కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక విధానాలపై బీఆర్ఎస్ పార్టీ నేతలు, రైతు సమన్వయ సమితి సభ్యులు, రైతులు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగాభివృద్ధి సాధిస్తుంటే కాంగ్రెస్‌పార్టీ నేతలకు కడుపు మండుతుందన్నారు. రైతుబీమా, రైతు బంధు, ఉచిత విద్యుత్ వంటి అనేక పథకాలను సీఎం కేసీఆర్ రూపొందించి విజయవంతంగా అమలు చేస్తున్నారని అన్నారు. సమైఖ్య పాలనలో వ్యవసాయం రంగం పూర్తిగా కుంటుపడిందని విమర్శించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయ్యాక సీఎం కేసీఆర్ రైతును రాజు చేయాలనే లక్ష్యంతో అన్ని విధాల ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి రైతులకు మూడు గంటల కరెంటు చాలని మాట్లాడడం చూస్తుంటే కాంగ్రెస్ పార్టీ నేతలకు రైతుల పట్ల ఎంత ప్రేమ ఉందో స్పష్టంగా తెలుస్తుందన్నారు. అన్నదాతల ఆశీర్వాదాలు సీఎం కేసీఆర్‌కు మెండుగా ఉన్నాయని అన్నారు. రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ గ్రామ గ్రామాన రైతులు తీర్మానాలు చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ గణేష్, సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, నారాయణ, లక్ష్మణ్‌నాయక్, పాపయ్య, రవీందర్‌రెడ్డి, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బీఆర్ఎస్‌తోనే సబ్బండవర్గాల అభివృద్ధి

ఎంపీపీ రవీందర్ యాదవ్

కేశంపేట: బీఆర్ఎస్ ప్రభుత్వంలో సబ్బండ వర్గాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎంపీపీ ఎల్లగమోని రవీందర్ యాదవ్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. మిషన్ భగీరథ పథకంతో ఇంటింటికి స్వచ్ఛమైన మంచి నీరు సరఫరా జరుగుతుందని తెలిపారు. రైతులకు 24గంటలు సబ్సిడీ విద్యుత్‌ను అందిస్తుంటే కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీలను గ్రామపొలిమేరలకు కూడా రాకుండా అడ్డుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని పుట్టోనిగూడకు చెందిన రాగ్యకు రూ. 30వేలు, కేశంపేటకు చెందిన పద్మయాదయ్యకు రూ.60వేలు, చాపల బాలరాజ్‌కు రూ.28వేల సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కేశంపేట సర్పంచ్ వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌ఖాన్, రాజశేఖర్ గుప్త, పర్వాత్‌రెడ్డి, భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.



కేశంపేట: సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎంపీపీ

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

షాద్‌నగర్: సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే చెక్కులను అందజేశారు. పట్టణంలోని 18వ వార్డుకు చెందిన పాలకొండ శ్రీనివాస్‌గౌడ్‌కు రూ.3లక్షలు, మొల్సూరి వెంకట్‌రెడ్డికి రూ.2లక్షల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, కౌన్సిలర్ ప్రేమలత, యుగేంధర్, జూపల్లి శంకర్ పాల్గొన్నారు.

కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి

షాద్‌నగర్‌రూరల్: సీఎం కేసీఆర్ కుటుంబ పాలనకు చరమగీతం పాడాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. రాహుల్‌గాంధీపై మంత్రి కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం పట్టణంలోని ముఖ్యకూడలిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మకు శవయాత్రను నిర్వహించి, దహనం చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో 24గంటల కరెంటు పేరుతో రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనలేని బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పేరుతో వ్యవసాయ పనిముట్లను దూరం చేస్తూ రైతులను దగా చేస్తుందని విమర్శించారు. కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని యెడల మరిన్ని ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేటీఆర్ దిష్టి బొమ్మ దహనం

నందిగామ: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీపై ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఇటీవల చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహాయాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం నందిగామలో మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ శ్రేణులు దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్ హాజరై మాట్లాడారు. 24 గంటలు విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని గొప్పలు చెప్పుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఆచరణలో చేసింది శూన్యమేనని విమర్శించారు. సబ్‌స్టేషన్లలో రికార్డులను పరిశీలిస్తే ఎక్కడా కూడా 24 గంటల విద్యుత్‌ను ఇచ్చింది లేదని చెప్పారు. రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో కొత్తూరు మండల పార్టీ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, ఎంపీటీసీలు దేపల్లి కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, కొమ్ముకృష్ణ, శ్రీకాంత్‌గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌రూరల్: కేటీఆర్ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహిస్తున్న నాయకులు



నందిగామ: కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బీఆర్ఎస్ విధానాలను ఎండగట్టాలి



సభ్యులకు నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని ఎలికట్టలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడుగా బద్దులమల్లయ్య, గౌరవ అధ్యక్షుడిగా చెన్నయ్య, లింగం, రవీందర్, వెంకట్రాములు, పకీరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యూసుఫ్ మియా, ఉపాధ్యక్షుడిగా శ్యాంకుమార్, శశికాంత్ రెడ్డి, కుమార్, రాజు, ప్రధాన కార్యదర్శిగా ఎండి.ఆజం, సహాయ కార్యదర్శులుగా నర్సింలు, కు మార్, రంగయ్య, కోశాధికారిగా చెన్నయ్య, సహా య కోశాధికారులుగా సురేష్, అనిల్, రమేష్, కృష్ణ, శ్రీను ఎన్నుకున్నారు. అలాగే, కాంగ్రెస్ పార్టీ బీసీసెల్ అధ్యక్షుడిగా బోనేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీను, ఉపాధ్యక్షుడిగా రాజు, శివ, ప్రధానకార్యదర్శిగా బాల్‌రాజ్, కార్యదర్శిగా సురేష్, కోశాధికారిగా హరిబాబు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా రాములు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యాదయ్య, ఉపాధ్యక్షుడిగా రామయ్య, మల్లేష్, పెద్దయాదయ్య, ప్రధాన కార్యదర్శిగా యాదయ్య, సహాయ కార్యదర్శిగా భీమ య్య, కార్యదర్శిగా ప్రశాంత్, కోశాధికారిగా చెన్నయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులుకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీశైలం, నాయకులు బసప్ప, నాగిసాయిలు, రాజు, శేఖర్, సుదర్శన్, శివ, నర్సింహ్మ, వెంకటేష్ యాదవ్, నవీన్, నరేష్, గోవింద్, రాజేష్, చెన్నయ్య పాల్గొన్నారు.

బీబీఏ కోర్సులతో ఉపాధి

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ



చేవెళ్ల: గ్రామీణ ప్రాంతంలోని విద్యార్థులకు మొదటిసారిగా విద్యతో పాటు ఉపాధి కల్పించే బీబీఏ(రిటైల్ ఆపరేషన్స్) కొత్త కోర్సు అందుబాటులోకి వచ్చిందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ పేర్కొన్నారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. బీబీఏ కోర్సుతో ప్రతి ఒక్కరికి కచ్చితంగా జాబ్‌ప్లేస్‌మెంట్ అవకాశాలు కల్పిస్తోందని చెప్పారు. చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ విద్యాసంవత్సరం మూడు సంవత్సరాల బీబీఏ (రిటైల్ ఆపరేషన్స్) కోర్సు ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కోర్సులో దోస్త్ వెబ్‌సైట్ ద్వారా అడ్మిషన్లు పొందాలన్నారు. ఈ కోర్సులో ప్రవేశం పొందిన విద్యార్థులకు రెండు నెలల బోధన అనంతరం జాబ్‌ప్లేస్‌మెంట్ ఇస్తూ హైదరాబాద్‌లో స్టోర్ సూపర్‌వైజర్‌గా అప్రెంటిస్‌షిప్ శిక్షణ పొందుతూ నెలకు 5వేల నుంచి 7500ల వరకు స్టైఫండ్ కూడా ఇవ్వబడుతుందని చెప్పారు.

రేపు ఎంఎస్‌పీ సన్నాహక సభ

ఎంఎస్‌పీ నాయకుడు అనంతయ్య

షాద్‌నగర్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ సాధనలో భాగంగా జిల్లాలోని మహేశ్వరంలో ఈ నెల 20న నిర్వహించనున్న జిల్లా సన్నాహక సభను విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిన్నోళ్ల అనంతయ్య కోరారు. ఈ సందర్భంగా అనంతయ్య మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రం మెడలు వంచైనా వర్గీకరణ సాధించుకునేందుకు మాదిగలు ఏకతాటిపైకి రావాలని కోరారు. సభకు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ నర్సింహ్మ, ఎంఎస్‌పీ నాయకులు శ్రవణ్‌కుమార్, అశోక్, ఆనంద్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనంతయ్య

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

ఎస్ఐ దేవకి

షాద్‌నగర్: విద్యార్థులు చిన్న నాటి నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని షాద్‌నగర్ ఎస్ఐ దేవకి అన్నారు. మంగళవారం పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాలలో నాయకత్వ వేడుక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఐ దేవకి మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితాల్లో నాయకత్వం అనేది పెద్ద పాత్ర పోషిస్తుందన్నారు. ఒక విద్యార్థి తమ కెరీర్‌లోని వివిధ దశల్లో ఎదురయ్యే క్లిష్ట పరిస్థితులను సులభంగా అధిగమించడంలో సహాయ పడుతుందని అన్నారు. అలాగే, క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎస్ఐ బ్యాడ్జీలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

30న ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సు

మొయినాబాద్: ఈ నెల 30న చేవెళ్లలో నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సును విజయవంతం చేయాలని చేవెళ్ల నియోజకవర్గం నేత దేశమళ్ల ఆంజనేయులు అన్నారు.మండల కేంద్రంలోని పద్మావతి గార్డెన్‌లో మంగళవారం ఉద్యమకారుల ఫోరం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల మరణించిన తెలంగాణ ఉద్యమకారులు సాయిచంద్, బైర్ల శ్రీనివాస్‌ల ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. అనంతరం ఆత్మగౌరవ సదస్సు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. మరణించిన ఉద్యమకారుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మొయినాబాద్ మండల కమిటీ అధ్యక్షుడిగా మహిపాల్, ప్రధాన కార్యదర్శిగా మల్లేష్, ఉపాధ్యక్షులుగా బన్సీలాల్, అర్జున్‌గౌడ్, సహాయ కార్యదర్శులుగా మల్లేష్, నవీన్, కోశాధికారిగా ఆకుల నవీన్, ప్రచార కార్యదర్శులుగా సుభాష్, నర్సింలు, మీడియా కార్యదర్శిగా రాజు, సాంస్కృతిక కార్యదర్శిగా జనార్దన్ , సలహాదారులుగా కేబుల్ రాజు, రమేష్, సునీల్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో ఉద్యమకారులు అవినాష్, రమేష్‌చారి, ఆంజనేయులుగౌడ్, సురేష్, నియాజ్, భిక్షపతి, భాస్కర్, అశోక్, రత్నం, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో విద్యా వ్యతిరేక పాలన



షాద్‌నగర్‌రూరల్: మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకురాలు ఝాన్సీ



చేవెళ్ల: మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యా వ్యతిరేక పాలనను కొనసాగిస్తుందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ అన్నారు. ఆగస్టు 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న కథన భేరిని బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ కోసం విద్యార్థులు ఆత్మబలిదానాలను చేసుకుంటే కల్వకుంట్ల కుటుంబం అధికారాన్ని అనుభవిస్తుందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుంటే మన ఉద్యోగాలు మనకు వస్తాయని ఆశించిన నిరుద్యోగులకు, విద్యార్థులకు తీరని నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో లక్ష మందితో నిర్వహించన్ను బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు శ్రీరామ్, నాయకులు సాయికుమార్, మహేందర్, శ్రీకాంత్, వంశీ, సాయి, రాకేష్, సలీం పాల్గొన్నారు.

ఆగస్టు 1న 'కథనభేరి' బహిరంగ సభ

చేవెళ్ల: విద్యార్థుల సమస్యలపై ఆగస్టు 1న భారీ విద్యార్థి బహిరంగ సభను నిర్వహిస్తున్నామని ఏబీవీపీ విస్తరక్ వంగ సంజీవరెడ్డి, క్యామ శ్రీకాంత్‌లు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పలు కళాశాలల్లో సమావేశాలు నిర్వహించి విద్యార్థులకు అవ గాహన కల్పించారు. ఏబీవీపీ రాష్ట్ర వ్యాప్తంగా 'మా ర్పు కోసం- మహా ఉద్యమం' అనే కార్యక్రమంలో భాగంగా చలో హైదరాబాద్ పేరుతో ఆగస్టు 1న కథనబేరి సభ నిర్వహిస్తాం దని చెప్పా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏ ర్పాటు కోసం 1200 మంది విద్యార్థులు ఆత్మ బలిదానం చేసుకుంటే కేవలం కల్వకుంట్ల కుటుంబం మాత్రమే లాభం పొందిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.5300కోట్ల స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2లక్షలపైగా ఉద్యో గాలు ఖాళీగా ఉన్నాయని ఆరోపించారు. భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు.

'సంకల్ప రథయాత్ర'కు సిద్ధంకండి



రథయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రను విజయవంతం చేయాలని రాష్ట్ర కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీం ఎంప్లాయి యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎండీ తాహెర్ అలీ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో రథయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. యాత్రకు తమ సంఘాల పూర్తి మద్దతును అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత పెన్షన్ సంకల్పయాత్ర ఈ నెల 16వ తేదీన జోగులాంబ గద్వాల్ జిల్లాలో ప్రారంభమైందన్నారు. రంగారెడ్డి జిల్లా, షాద్‌నగర్, రాజేంద్రనగర్‌లోకి ఈ నెల 30వ తేదీన ప్రవేశించడం జరుగుతుందన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని రథయాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి అక్బర్, ప్రధాన ఉపాధ్యాయులు నరహరి, జయసింహారెడ్డి, సుధాకర్, ఆశీర్వాదం, రాజేశ్వరి, శంకర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రేవతిరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులుపాల్గొన్నారు.